సాక్షి
చిత్తూరు
గురువారం । 21 । ఆగస్టు । 2025



శాస్త్రోక్తంగా ప్రదోషకాల పూజ
కాణిపాకంలోని మణికంఠేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రదోషకాల పూజలు శాస్త్రోక్తంగా చేశారు. - 8లో



వి.కోటలో చైన్ స్నాచింగ్
వి.కోటలో గుర్తుతెలియని దుండగులు బైక్‌లో వెళుతూ మహిళ మెడలో బంగారు చైన్ లాక్కెళ్లారు. - 8లో



ప్రొటోకాల్ పాటించరూ!
కాణిపాకం వరసిద్ధుడి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలో కూటమి నేతలు ప్రొటోకాల్ పాటించ లేదని స్థానికులు మండిపడుతున్నారు. - 8లో

అగౌరవ యాతన జీవి

ప్రజలకు ఏవైనా సమస్యలొస్తే ప్రజాప్రతినిధులకు చెప్పుకుంటారు.. మరి వారికే సమస్యలు ఎదురైతే ఎవరికి చెప్పుకోవాలో తెలియక దిక్కుతోచని స్థితిలో కుమిలిపోవాల్సిన దుస్థితి. ఇదే జరుగుతోంది ప్రస్తుతం రాష్ట్రంలో. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలకు కనీస గౌరవం దక్కక పోగా.. వారికి 16 నెలలుగా గౌరవ వేతనం అందకపోవడంతో యాతన పడుతున్నారు.

- జెడ్పీటీసీ.. ఎంపీటీసీ సభ్యులపై 'కూటమి' చిన్న చూపు
- ప్రొటోకాల్ పట్టించుకోని పచ్చనేతలు
- పల్లెల్లో కూటమి నేతలకే అధికార పెత్తనం.. మర్యాద
- 16 నెలలుగా గౌరవ వేతనం కూడా ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం
- అత్యధికం వైఎస్సార్‌సీపీ నేతలే కావడంతోనే నిర్లక్ష్యం
- ఉమ్మడి జిల్లాలో 65 మంది జెడ్పీటీసీ.. 877 మంది ఎంపీటీసీ సభ్యులు

చిత్తూరు అర్బన్: ఓటు ద్వారా ప్రజల చేత ఎన్నుకున్న స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధుల పరిస్థితి జిల్లాలో దారుణంగా మారింది. పరిపాలనలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఆమోదం తీసుకోవాల్సిన అధికారులు.. వాళ్లను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థలకు చెందిన నేతలకు కనీస గౌరవం దక్కడంలేదు. పెత్తనమంతా గ్రామాల్లో పచ్చ నేతలదే కనిపిస్తోంది. అధికారులు కూడా వాళ్లకే జై కొడుతుండడం విమర్శలకు దారితీస్తోంది.

ప్రొటోకాల్ ఎక్కడ..?
ప్రభుత్వం ఏ పార్టీకి చెందినదైనా ఓ అధికారిక కార్యక్రమం జరిగితే స్థానికంగా ఉన్న సర్పంచ్ నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు తప్పనిసరిగా ఆహ్వానం అందించాలి. కానీ ప్రభుత్వ కార్యక్రమాలను పూర్తిగా టీడీపీ కార్యక్రమాలుగా నిర్వహిస్తున్నారు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులను ఆహ్వానించపోగా, సభా వేదికపైకి కూడా పిలవడంలేదు. కుప్పంలో ఇటీవల జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యుడిని సభాస్థలిపైకి అధికారులు అనుమతించలేదు. ఇక రోడ్లు, కాలువలు, ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించే సమయంలో శిలాఫలకాలు చూస్తే.. పూర్తిగా టీడీపీ నాయకుల పేర్లతో నిండిపోతోంది. అసలు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను పట్టించుకోవడం మానేశారు. కేవలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కావడంతోనే గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ గౌరవం దక్కడం లేదనేది బహిరంగ రహస్యం.



చిత్తూరులోని జెడ్పీ కార్యాలయం

వేతనంపై కక్షసాధింపు..
ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 65 మంది జెడ్పీటీసీ సభ్యులు, 65 మంది ఎంపీపీలు, 877 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. జెడ్పీటీసీ సభ్యులు పది మంది వరకు టీడీపీ వాళ్లు ఉంటే.. ఎంపీటీసీ సభ్యులు 60 మంది వరకు ఉన్నారు. మిగిలిన 80 శాతం మంది ప్రజాప్రతినిధులు వైఎస్సార్ సీపీకి చెందిన వారే. దీంతో వాళ్లకు ఇచ్చే గౌరవ వేతనంపై ప్రభావం పడింది. దాదాపు 16 నెలలుగా జెడ్పీలోని ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనం ఇవ్వడం లేదు. దీనికి కారణం గత స్థానిక ఎన్నికల్లో 90 శాతానికి పైగా స్థానాలు వైఎస్సార్ సీపీకి దక్కడమే. రాష్ట్రంలో అధికారం మారాక కొందర్ని బలవంతంగా సైకిల్ ఎక్కించి కండువాలు కప్పారు. మిగిలినవారు దీనికి అంగీకరించకపోవడంతో స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తూ, స్థానిక ప్రజాప్రతినిధులను పక్కన పెట్టి అవమానిస్తోందన్న ఆరోపణలున్నాయి.

పేరుకే పదవులు..



పేరుకు మాత్రమే మేము పదవుల్లో ఉండాం. ఏదైనా ప్రోగ్రాం జరిగితే కనీసం చెప్పడం మానేశారు. ఒక్కొక్క సారి పిలిచి, వేదికపై ఎవరెవరినో కూర్చోపెట్టి మమ్మల్ని అవమానిస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, స్థానిక ప్రజా ప్రతినిధులను గౌరవించడంలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక గౌరవ వేతనం కూడా అందలేదు.
– ప్రతిమారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు, చెర్లోపల్లె, చిత్తూరు.

గుర్తింపు లాక్కున్నారు..



ప్రభుత్వం నిర్వహిస్తున్న అధికారిక కార్యక్రమాల్లో అధికారులు మాకు గుర్తింపు ఇవ్వడం లేదు. ఏ కార్యక్రమానికి సమాచారం ఇవ్వడం లేదు. కొన్ని కార్యక్రమాలకు నామమాత్రంగా సమాచారం ఇస్తున్నారు. టీడీపీ నాయకులే ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలుగా వ్యవహరిస్తున్నారు. అధికారులు వారికి వత్తాసు పలుకుతున్నారు.
– సురేష్‌బాబు, ఎంపీపీ, యాదమరి మండలం

సమావేశాలతో సరి..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక ప్రజా ప్రతినిధులకు విలువ లేకుండాపోయింది. అధికారిక కార్యక్రమాలు కాస్త పార్టీ కార్యక్రమాల్లా మారిపోయాయి. మమ్మల్ని కేవలం సర్వసభ్య సమావేశాలకు మాత్రమే పిలుస్తున్నారు. అంశాలు ఆమోదించినట్లు సంతకాలు పెట్టించుకుంటున్నారు. గౌరవ వేతనంలేదు. కనీస గౌరవం కూడా ఇవ్వడంలేదు.
– కృష్ణమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు, గుడుపల్లె

చిన్నచూపు..



ఇక్కడ ఏం జరిగినా వైఎస్సార్ సీపీ అంటూ మమ్మల్ని చిన్నచూపు చూస్తున్నారు. గతంలో ఏ పార్టీ నాయకులైనా సమానంగా గౌరవించాం. ఇపుడాగౌరవం లేదు, సమానత్వం లేదు. ప్రభుత్వ కార్యక్రమాలు జరిగితే కనీసం చెప్పడం కూడా లేదు. ఎన్ని రోజులు ఇలా చేస్తారో చూద్దాం.
– భారతి, ఎంపీటీసీ సభ్యురాలు, పాపిరెడ్డిపల్లె, గంగాధరనెల్లూరు

న్యూస్‌రీల్

వరసిద్ధుడికి రూ.1.67 కోట్ల ఆదాయం



హుండీని లెక్కిస్తున్న ఆలయాధికారులు, సిబ్బంది

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలోని హుండీ ద్వారా రూ.1,67,32,780 ఆదాయం ఈఓ పెంచలకిషోర్ తెలిపారు. కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధ వారం లెక్కించారు. ఈఓ పెంచల కిషోర్ పర్యవేక్షణలో జరిగిన ఈ హుండీ లెక్కింపులో బంగారం 50 గ్రాములు, వెండి 1.617 కిలోలు వచ్చిందని ఈఓ పేర్కొన్నారు. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా రూ.16,236, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.41,450 వచ్చిందన్నారు. యూఎస్‌ఏ డాలర్లు 397, సింగపూర్ డాలర్లు 5, మలేషియా రింగిట్స్ 1, యూఏఈ దిర్హామ్స్ 230, కెనడా డాలర్లు 105, ఆస్ట్రేలియాడాలర్లు 70, యూరో దేశానికి చెందిన 325 యూరోలు, ఇంగ్లాడ్ 10 పౌండ్స్ వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సాగర్‌బాబు, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరి మాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్, నాగేశ్వర రావు, కోదండపాణి, సుబ్రమణ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీవార్మింగ్ 99.81 శాతం పూర్తి

చిత్తూరు అర్బన్(కాణిపాకం): నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ (డీవార్మింగ్ కార్యక్రమం) 99.81 శాతం పూర్తి చేసినట్లు ఇన్‌చార్జ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటప్రసాద్ తెలిపారు. ఈనెల 12వ తేదీ నుంచి మాత్రల పంపిణీ కార్యక్రమం ప్రారంభించామన్నారు. జిల్లాలో 3,61,848 పిల్లలుంటే ఇప్పటి వరకు 3,61,848 మంది పిల్లలకు మాత్రలు అందజేశామని ఆయన పేర్కొన్నారు.

అడ్మిషన్లు పరిమితికి మించితే చర్యలు తప్పవు



డీఐఈఓ రఘుపతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో పరిమితికి మించి అడ్మిషన్లు చేసుకుంటే చర్యలు తప్పవని ఇంటర్మీడియట్ డీఐఈఓ రఘుపతి హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు కచ్చితంగా ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కళాశాలల అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, ఎంసెట్ మెటీరియల్‌ను పంపిణీ చేశామన్నారు. జిల్లాలోని 31 ప్రభుత్వ కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరం 3,970 అడ్మిషన్లు, 98 ప్రైవేట్ కళాశాలల్లో 11,042 మొత్తం 15,012 అడ్మిషన్లు జరిగినట్లు తెలిపారు. గత విద్యాసంవత్సరం కంటే అడ్మిషన్లు మెరుగుపడ్డాయన్నారు. ఈ నెల 31 వ తేదీ వరకు ఆన్‌టీసీ అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా 20 వరకు మూతపడిన కళాశాలలున్నట్లు తెలిపారు. ఆ కళాశాలలపై ప్రత్యేక నిఘా పెట్టామని డీఐఈఓ వెల్లడించారు.

ఆచార్య మోతోభవ!



మాతృదేవోభవ..పితృదేవోభవ.. అమ్మానాన్నలు దేవుళ్లతో సమానం.. ఆ తరువాతి స్థానం ఆచార్యుడిదే. అందుకే ఆచార్యదేవోభవ అని గురువులను వేనోళ్ల కీర్తిస్తారు. ఇదీ మన భారతీయ సంప్రదాయంలో గురువుకున్న విలువ. అలాంటి స్థానంలో నిలిచిన గురువులను కూటమి సర్కారు కూలీల కింద లెక్క కట్టింది. పుస్తకాలు మోత భారం ఉపాధ్యాయులపై మోపింది. విధిలేక.. ఉద్యోగం వదులుకోలేక.. కొందరు ఉపాధ్యాయులు పుస్తకాలను నెత్తిపై పెట్టుకుని మోశారు. తమది కానీ ధర్మం నెరవేర్చారు. ఈ చిత్రం చూస్తే కూటమి ప్రభుత్వం గురువులకు ఏ పాటి స్థానం ఇస్తుందన్న విషయం తేట తెల్లమవుతోంది. గత ఎన్నికల్లో టీచర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోంది. గౌరవ ప్రధమైన వృత్తిలో ఉండే ఉపాధ్యాయులు చంద్రబాబు జమానాలో దినసరి కూలీల అవతారం ఎత్తాల్సిన పరిస్థితి వచ్చింది. టీచర్లపై ఈ సర్కారు ఎలాంటి ఒత్తిడి మోపుతుందనడానికి ఓ ఉపాధ్యాయుడు నెత్తిపై పుస్తకాల కట్ట, భుజం మీద, చేతిలో మరో పుస్తకాల కట్టలను మోస్తున్న చిత్రమే నిదర్శనం. ఈ చిత్రం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

– చిత్తూరు కలెక్టరేట్

ఎంపీకి బెయిల్ రావాలంటూ శ్రీవారికి మొక్కులు



కాలినడకన తిరుమలకు చేరుకున్న హరిప్రసాద్ రెడ్డి బృందం

- శ్రీవారిమెట్టు నుంచి తిరుమలకు వెళ్లిన అభిమానులు

చంద్రగిరి : ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి జైలులో పెట్టడంతో ఆయనకు త్వరగా బెయిల్ రావాలంటూ ఆయన అభిమానులు తిరుమల వెంకన్నకు మొక్కుకున్నారు. ఈ మేరకు మూడు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పీలేరు నుంచి తిరుమలకు పాదయాత్రను చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం వారిని పోలీసులు అక్రమంగా అడ్డుకుని, స్టేషన్‌లో నిర్బంధించారు. రాత్రి వరకు స్టేషన్‌లోనే ఉంచుకుని ఆపై సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అనంతరం బుధవారం ఉదయం హరిప్రసాద్ రెడ్డితో పాటు అభిమానులు శ్రీవారిమెట్టుకు చేరుకున్నారు. ముందుగా అక్కడ స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి తిరుమలకు పాదయాత్రను కొనసాగించారు. తిరుమలకు చేరుకున్న వారు శ్రీవారిని దర్శించుకుని, తమ అభిమాన నేత ఎంపీ మిథున్ రెడ్డికి త్వరగా బెయిల్ మంజూరు కావాలని ప్రార్థించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తోందన్నారు. శాంతియుతంగా చేస్తున్న పాదయాత్రను అక్రమంగా అడ్డుకుని, నిర్బంధించడం దీనికి ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ పనుల పరిశీలన

కుప్పం: నియోజక వర్గంలో జరుగుతున్న హంద్రీనీవా కాలువ పనులను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, త్వరలో పూర్తి చేసి నీరు తీసుకువస్తామన్నారు. నియోజక వర్గంలోని 430 చెరువులను హంద్రీనీవా జలాలతో నింపుతామన్నారు. చెరువుల సామర్థ్యం, చెక్‌డ్యాములు బాగు చేయడం, నీటి నిలువల్లో ఎలాంటి లోపాలు ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఈలను ఆదేశించారు. అనంతరం రాష్ట్రంలోనే కుప్పంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన డిజిటల్ సర్వే సెంటర్ పనితీరును పరిశీలించారు.



హంద్రీనీవా కాలువ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికను వినియోగించుకోవడంతో వ్యాధులను ముందుగానే గుర్తించే చికిత్సలు తీసుకోవచ్చన్నారు. కుప్పం నియోజక వర్గంలో 13 పీ హెచ్‌సీలు, 92 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను అనుసంధానం చేశామన్నారు. వ్యక్తిగత వైద్య రికార్డుల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండేలా ఈ కేంద్రాలు చూస్తాయన్నారు. డిజిటల్ సర్వే సెంటర్లను పరిశీలించి, ఎంత మంది పేషంట్లు వస్తున్నారు.. డాక్టర్లు ఏ సమయానికి వస్తున్నారు.. ఎప్పుడు వెళుతున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీ ర్ తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ వరప్రసాద్, హెచ్‌ఎన్‌ఎస్ ఎస్ ఎస్‌ఈ విఠల్‌ప్రసాద్, కుప్పం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గోవర్ధన్ పాల్గొన్నారు.

బాబూ..దివ్యాంగులపై ఎందుకంత కక్ష?

- వైఎస్సార్‌సీపీ పూతలపట్టు సమన్వయకర్త డాక్టర్ సునీల్

యాదమరి: ' కూటమి సర్కారు దివ్యాంగులపై కనీసం మానవత్వం చూపలేదు. పైగా వారు పదేళ్లుగా తీసుకుంటున్న పింఛన్లు కోత పెట్టింది. వారిపై ఎందుకంత కక్షపూరితంగా వ్యవహరిస్తుందో చెప్పాలి.?' అని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ మండిపడ్డారు. బుధవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దుర్భర జీవితాలు అనుభవిస్తున్న దివ్యాంగులపై చంద్రబాబు సర్కారు అనుసరిస్తున్న తీరు బాధాకరమన్నారు. కూటమి సర్కారు దివ్యాంగులను మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సింది పోయి, వారి బతుకులతో ఆడుకుంటోందని ధ్వజమెత్తారు. రీ వెరిఫికేషన్ పేరుతో ఇప్పటికే జిల్లాలో 4,732 మంది అర్హత కలిగిన లబ్ధిదారుల పింఛన్లను తొలగించడం దారుణమన్నారు. పూర్తిగా మంచానికే పరిమితమైన మానసిక, శారీరక వైకల్యం కలిగిన నిజమైన పింఛనుదారులకు సైతం సెప్టెంబర్ నెల నుంచి తమకు పింఛన్ రాదని అధికారులతో నోటీసులు ఇవ్వడం శోచనీయమన్నారు. అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే పరిస్థితి ఇలా ఉండేదా? అని అన్నారు. దివ్యాంగుల శోకం రాష్ట్రాభివృద్ధికి అంత శ్రేయస్సు కాదని చంద్రబాబుకు హితవు పలికారు. సదరం ధ్రువపత్రాల కోసం నడవలేని స్థితిలో ఉన్నవారి ఆస్పత్రుల చుట్టు తిప్పడం సమంజసం కాదన్నారు. ప్రజల ముంగిటికే ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నామని ఉత్తర ప్రగల్భాలు పలుకుతున్న కూటమి నేతలు..వైద్య పరీక్షలు కూడా వికలాంగుల చెంతకే వెళ్లి చేయవచ్చు కదా? సూటిగా ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు సృష్టించాలన్నా.. వాటి ఫలాలు ప్రజలకు అందాలన్నా.. అది కేవలం వైఎస్ జగనన్నకే సాధ్యమన్నారు. సంక్షేమ పథకాల కోతలపై కూటమి ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. లేని పక్షంలో వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల తరఫున పోరాటం ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.



పూతలపట్టు సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్

వలస పక్షుల్లా.. భాషోపాధ్యాయులు

- బలవంతపు బదిలీలతో తప్పని తిప్పలు
- గత ఆరేళ్లలో నాలుగు సార్లు బదిలీలే
- బదిలీ అయిన చోటా వీరిని పెట్టకుండా డిప్యూటేషన్లు
- విద్యాసంవత్సరం చివరి రోజు మాత్రమే వీరు సొంతబడికి
- న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలు బేఖాతర్
- న్యాయం చేస్తామన్న ఉపముఖ్యమంత్రి పట్టించుకోలేదు !

పలమనేరు: కొన్నేళ్లుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న భాషోపాధ్యాయులపై విద్యాశాఖ అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. వీరికి బలవంతపు బదిలీలు, డిప్యూటేషన్లు తప్పడం లేదు. గత ఆరేళ్లలో నాలుగు దఫాలు వీరు బదిలీకే పరిమితమవుతున్నారు. పోనీ బదిలీతో ఆపుతారనుకుంటే అదీ లేదు. వీరిని డిప్యూటేషన్లపై వేరే బడికి పంపడం రివాజుగా మారుతోంది. ఉమ్మడి జిల్లాలోని ఉన్నత పాఠశాల్లో పనిచేస్తున్న 164 మంది భాషోపాధ్యాయులు వలసపక్షుల్లాగా మారిపోయారు. కోర్టుమెట్లెక్కి అనుమతి తీసుకున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై పలువురు భాషోపాధ్యాయులు రగిలిపోతున్నారు.

ఇంతకీ ఏం జరిగిందంటే?
2019లో రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న భాషోపాధ్యాయులకు (తెలుగు, హిందీ, ఉర్దూ, తమిళం, కన్నడ, ఒరియా, సంస్కృతం) జీవో



గుడిపల్లి మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాలలో పాఠాలు చెబుతున్న హైస్కూల్ ల్యాంగ్వేజ్ పండిట్

నంబర్ 91 మేరకు ఉన్నతీకరణ జరిగింది. ఆ జీవో అమలు కాకుండా కొందరు కోర్టుకెళ్లారు. ఈ నేపథ్యంలో వీరిని పక్కనబెట్టి ఉన్నతీకరణలో ఎస్‌జీటీలకు చోటు కల్పించేలా ఆదేశాలను తెచ్చారు. దీంతో విద్యాశాఖ జీవో నంబర్77 ద్వారా ఎస్జీటీలకు మేలు కలిగేలా చేశారు. ఎల్‌పీ(ల్యాంగేజ్ పండిట్స్) కేడర్ లేకుండా చేశారు. ఈ క్రమంలో వీరికి ఎల్‌పీ వ్యవస్థ లేకుండా .. ఉన్నతీకరణ లేకుండా పోయింది.

కోర్టు ఆదేశాలు బేఖాతర్
తమకు జరిగిన అన్యాయంపై భాషోపాధ్యాయులు 2024లో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ మన్మధరావు సింగిల్ బెంచ్ వారికి అనుకూలంగా తీర్పునిచ్చింది. 2019 నుంచి వీరికి అన్ని సదుపాయాలను కల్పించి, మూడు నెలల్లో ప్రమోషన్ అర్హతలున్నవారికి అవకాశం ఇవ్వాలని తీర్పులో పేర్కొంది. ఈ తీర్పును అమలు చేయాలని భాషోపాధ్యాయులు రాష్ట్ర విద్యాశాఖను కోరింది. దీంతో వారు వేకన్సీలు లేవని సెలవుల్లో ఈ ప్రక్రియ ఉంటుందని దాట వేసింది. ఇది జరిగితే తమకు ఇబ్బందిగా ఉంటుందని భావించిన ఎస్జీటీలు దీనిపై హైకోర్టులో స్టేటస్‌కో ఉత్తర్వులను పొందారు. ఫలితంగా వీరి సమస్య మరింత జఠిలంగా మారింది. అప్పట్లో విద్యాశాఖ చేసిన అలసత్వం వీరికి శాపంలా మారింది.

బలవంతపు బదిలీలు
తమపైనే కోర్టుకెళ్లారనే అక్కసుతో విద్యాశాఖ సైతం వీరితో చెలగాటమాడుతోంది. ఆ మేరకు గత ఆరేళ్లలో వీరిని నాలుగు దఫాలు బదిలీలను చేసింది. బదిలీ చేసిన చోటా ఉంచకుండా వర్క్ అడ్జెస్ట్‌మెంట్ సాకుతో మూడు నెలలు, ఆరు నెలలు ఓ బడిలో పనిచేశాలా డిప్యూటేషన్లు వేస్తోంది. మళ్లీ అధికారికంగా బదిలీ అయిన బడికి ఆ విద్యాసంవత్సరంలో చివరి రోజు పంపుతోంది.

చేతులెత్తేసిన డిప్యూటీ సీఎం
తమ సమస్యను మీరైనా పరిష్కరించాలంటూ గత యేడు తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా పలువురు భాషోపాధ్యాయులు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను వేడుకున్నారు. వచ్చే విద్యాసంవత్సరం లోపు మీ సమస్యలు పరిష్కరిస్తామని వారికి ఆయన హామీ ఇచ్చారు. కానీ రెండేళ్లవుతున్నా దీనిపై ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

క్యాడర్ లేకుండా ఆరేళ్లుగా పనిచేస్తున్నా



నేను ఆరేళ్లుగా క్యాడర్ లేకుండా పనిచేస్తున్నా. కనీసం మాకు జాబ్ కార్డు కూడా లేదు. ప్రమోషన్లూ లేకుండా చేశారు. కోర్టు తీర్పునిచ్చినా విద్యాశాఖ వాటిని అమలు చేయడం లేదు. ఇంత దారుణం ఎక్కడా లేదు. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో..?
– బెంగళూరు స్వామినాథుడు, తెలుగు పండిట్, గుడిపల్లి మండలం

ఇంత వివక్ష ఎందుకు?



తెలుగు భాషోపాధ్యాయులపై విద్యాశాఖ ఎందుకింత వివక్ష చూపుతోందో అర్థం కావడం లేదు. మేము ఉన్నత పాఠశాలలో తెలుగును బోధించాలి. కానీ మమ్మల్ని ప్రైమరీ బడుల్లో టీచర్లు సెలవు పెట్టిన చోటుకు పంపుతున్నారు. జాబ్‌చార్ట్‌లేకుండా చేసి ఎక్కడిపడితే అక్కడికి పంపుతున్నారు.
– హిమబిందు, జెడ్పీహెచ్‌ఎస్, కే.గొల్లపల్లి, యాదమరి మండలం

ఆడుకుంటున్నారు



మేమేం పాపంచేశామోగానీ విద్యాశాఖ మాకు ఎలాంటి క్యాడర్ లేకుండా, ప్రమోషన్లు లేకుండా చేసింది. దీంతోపాటు ఉన్నత పాఠశాలలో భోదించే మమ్మల్ని ప్రైమరీ బడులకు పంపుతోంది. అదీ ఓ చోట కాదు ఎక్కడిబడితే అక్కడికి వెళ్లి పాఠాలు చెప్పాలి. మహిళలమైన మాకు మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా స్పందించాలి.
– భాగ్యలక్ష్మి, తెలుగు పండిట్, రామసముద్రం

విద్యాశాఖకు రెండు బహుమతులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్రస్థాయిలో ఈ నెల 19న నిర్వహించిన వికసిత్ భారత్ సెమినార్‌లో చిత్తూరు జిల్లా విద్యాశాఖకు రెండు బహుమతులు లభించాయి. ఈ సెమినార్‌కు జిల్లా తరఫున డీఈఓ వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ తరఫున టీమ్‌గా ఏర్పడి ఇతర అధికారుల సమన్వయంతో డీఈఓ వరలక్ష్మి ఎఫ్‌ఎల్‌ఎన్ (ఫంక్షనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) అనే అంశంపై సెమినార్ ఇచ్చారు. అలాగే జిల్లా సమగ్రశిక్ష శాఖ ఏపీసీ మద్దిపట్ల వెంకటరమణ స్కూలింగ్.. బిల్డింగ్ బ్లాక్స్ అనే అంశంపై టీమ్‌గా ఏర్పడి సెమినార్ ఇచ్చారు. ఈ సెమినార్ టీమ్‌లలో పలు జిల్లాలకు చెందిన డీఈఓ, ఏపీసీలు సభ్యులుగా ఉన్నారు. రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వరరావు అధ్యక్షతన సెమినార్ నిర్వహించి నిర్దేశించిన 10 థీమ్‌లపై చర్చించారు. ఈ సెమినార్‌లో జిల్లా సమగ్రశిక్ష శాఖ ఏపీసీ పాల్గొన్న సెమినార్‌లో 'బాల్యం బాగుంటే భవిష్యత్ బాగుంటుంది' అనే చర్చలో మొదటి బహుమతి సాధించారు. అలాగే ఎఫ్‌ఎల్‌ఎన్ టీమ్‌కు రెండో బహుమతి లభించింది. ఈ సెమినార్‌లో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, సమగ్రశిక్ష శాఖ ఎస్పీడీ శ్రీనివాసరావు చేతుల మీదుగా డీఈఓ, ఏపీసీలు బహుమతులు స్వీకరించారు.



ఎస్పీడీ చేతుల మీదుగా బహుమతి స్వీకరిస్తున్న జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ

క్లుప్తంగా

విద్యుత్ గ్రీవెన్స్‌కు 4 సమస్యలు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని అర్బన్ డివిజన్ ట్రాన్స్‌కో కార్యాలయం ఆవరణలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన వినియోగదారులు వినతులు అందజేశారు. వాటిని సకాలంలో పరిష్కారించాలని డీఈ ప్రసాద్ ఆదేశించారు. వ్యవసాయ సర్వీసులకు డబ్బులు కట్టి వేచి చూస్తున్నమని వెంటనే సర్వీసు ఇవ్వాలని రెడ్డిగుంట, కొత్తపల్లె సెక్షన్ పరిధిలోని రైతులు ఫిర్యాదు చేశారు. కొత్తపల్లెలో నీటి సరఫరా కోసం మీటరు ఇవ్వాలని వినియోగదారుడు వినతిపత్రం సమర్పించారు. భూతగాదాలో ఉన్న సర్వీసు మీటర్ మార్చవద్దని చిత్తూరు రూరల్ పరిధిలోని ఓ వినియోగదారుడు తెలియజేశారు. సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీఈ వివరించారు. టెక్నికల్ ఏఈ మాధురి పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ టీవీల సమర్పణ



టీవీలు అందజేస్తున్న దాతలు

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి బుధవారం ఓ దాత ఎల్‌ఈడీటీవీలను విరాళంగా సమర్పించారు. చిత్తూరు నగరానికి చెందిన విమ్సన్ అధినేతలు రవీంద్రనాథ్, రమణ రూ.1.20 లక్షలు విలువ చేసే 55 ఇంచెస్ రెండు టీవీలను ఈఓ పెంచలకిషోర్‌కు అందజేశారు. అనంతరం ఆయన వారికి ప్రత్యేక దర్శనం కల్పించారు.

రైలు ఢీకొని టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి



శ్రావణ్‌కుమార్ (ఫైల్)

పుత్తూరు: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి రైలు ఢీకొని ఎం.శ్రావణ్‌కుమార్(31) అనే యువకుడు మృతి చెందాడు. స్థానిక లక్ష్మీనగర్ కాలనీలో నివాసమున్న శ్రావణ్‌కుమార్ నాగలాపురంలోని వేదనారాయణస్వామి ఆలయంలో నాదస్వర విద్వాన్‌గా కాంట్రాక్ట్ బేసిక్‌పై పనిచేస్తున్నాడు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న లక్ష్మణ్

చిత్తూరు కలెక్టరేట్ : రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏల అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు కోదండన్ డిమాండ్ చేశారు. ఆ అసోసియేషన్ నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలోని రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు సకాలంలో ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. వీఆర్‌ఏల పై ఉండే శాఖాపరమైన చర్యలు త్వరతిగితిన విచారించి పరిష్కరించాలన్నారు. ఆ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఇర్ఫాన్ అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరాజ్, నాయకులు పెరుమాల్, రూపాణి, ఉదయ్, నరేష్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ప్రదోషకాల పూజ

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైనా మణికంఠేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రదోషకాల పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్, నందీశ్వరుడికి ఏకకాలంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. స్వామివారికి విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు

కన్నీళ్లు తెప్పింఛన్

దివ్యాంగులకు ఆసరా అందించే పింఛన్‌కు కూటమి సర్కారు గండి కొట్టింది. రీ వెరిఫికేషన్ పేరుతో అర్హులైన పలువురికి పింఛన్ రద్దు చేయగా, మరెందరికో కోత విధించింది. ఫలితంగా దివ్యాంగుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. సదరమ్ సర్టిఫికెట్లు, రీవెరిఫికేషన్ కోసం ఆస్పత్రులకు నడవలేక.. అధికారులు చుట్టు తిరగలేక ఇక్కట్లు పడుతున్నారు. వారికి పింఛన్ కన్నీళ్లు తెప్పిస్తోంది.

- అధికారుల వద్దకు దివ్యాంగుల పరుగులు
- పింఛన్ల కోత, పింఛన్ డబ్బు తగ్గింపు
- గగ్గోలుపెడుతున్న బాధితులు



వెరిఫికేషన్ చేసి న్యాయం చేయాలని ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన దివ్యాంగులు

బంగారుపాళెం: కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్లలో కోత పెడుతోంది. దీంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. పూర్తి వైకల్యం కలిగి ఉన్నప్పటికీ తమకు పింఛన్లను తొలగించారంటూ బుధవారం పలువురు దివ్యాంగులు బంగారుపాళెం ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకుని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఇటీవల వికలాంగ పింఛన్ల రీ వెరిఫికేషన్ చేపట్టారు. ఈ క్రమంలో మండలంలో 159 మంది అనర్హులుగా తేల్చి నోటీసులు అందజేశారు. తాము పుట్టుకతోనే వికలాంగులుగా ఉన్నామని, 90 శాతం వైకల్యం ఉందని డాక్టర్లు పరిశీలించి సర్టిఫికెట్లు సైతం జారీ చేశారన్నారు. రీ వెరిఫికేషన్‌లో తమకు 40 శాతం కంటే తక్కువ ఉందని పింఛన్ కట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైకల్యంతో బాధపడుతూ ప్రభుత్వం ఇచ్చే డబ్బుపైనే ఆధారపడి కాలాన్ని నెట్టుకొస్తున్న తరుణంలో పింఛన్ తొలగించడంతో దిక్కుతోచడంలేదన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి అందుతున్న పింఛన్లను అకారణంగా ఎందుకు తొలగించారో అర్థం కాక, ఏమి చేయాలో దిక్కు తోచక తమకు న్యాయం చేయాలంటూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామన్నారు.

నాకు పింఛన్ కట్ చేశారు

నేను పుట్టుకతోనే దివ్యాంగుడిని. నాకు 95 శాతం వైకల్యం సర్టిఫికెట్ ఉంది. గతంలో రూ 15 వేలు పింఛన్ వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం వికలాంగుల పింఛన్ రీ వెరిఫికేషన్ చేసింది. తనకు 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందంటూ నోటీసు ఇచ్చి పింఛన్ కట్ చేశారు. నడవలేని స్థితిలో ఉన్న మాలాంటి దివ్యాంగులకు పింఛన్‌లో కోత విధించడం ఎంతవరకు సమంజసం. తమకు పింఛన్ అందించి న్యాయం చేయాలి.

–గోపి, దివ్యాంగుడు, తంబుగానిపల్లె

రూ.6 వేలకు తగ్గించారు

నేను పుట్టుకతోనే దివ్యాంగుడిని. 90 శాతం వైకల్యం సర్టిఫికెట్ ఉంది. వైకల్యం శాతం తగ్గించి రూ.15 వేలు వస్తున్న పింఛన్‌ను తగ్గించి రూ.6 వేలకు మార్చారు. ఇలా 48 మందికి పింఛన్లను తగ్గించారు.

– ప్రభాకర్‌రెడ్డి, దివ్యాంగుడు, తగ్గువారిపల్లె

ప్రొటోకాల్ పాటించరూ!

- కాణిపాకం బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలో ప్రొటోకాల్ లేదని మండిపాటు
- ఆలయంలో పార్టీలెందుకని ప్రశ్నల వర్షం
- కూటమి ప్రజాప్రతినిధుల మాత్రమే ఫొటోల ముద్రణపై ఆగ్రహం



2025లో ఎమ్మెల్సీల ఫొటోలకు ఎసురుపెట్టిన దృశ్యం

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలో ప్రొట్‌కాల్ ఉల్లఘించారని కాణిపాక వాసులు మండిపడుతున్నారు. కాణిపాకం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏటా ప్రొటోకాల్ ప్రకారమే ఆహ్వాన పత్రికలు ముద్రించేవారు. ఈ ముద్రణ పార్టీలకతీతంగా ఉండేది. గత ఐదేళ్లలో కూడా ప్రొటోకాల్‌కు ఇబ్బంది రాకుండా చూసుకున్నారు. టీడీపీకి చెందిన ఎమ్మెల్సీ దొరబాబు ఫొటోతో సహా ముద్రిస్తూ వచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రూల్స్ మారాయని కాణిపాకం వాసులు మండిపడుతున్నారు. కూటమికి చెందిన ప్రజాప్రతినిధుల ఫొటోలు మాత్రమే పత్రికలో వేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా వైఎస్సార్‌సీపీకి చెందిన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, భరత్, చంద్రశేఖర్‌రెడ్డి ఫొటోలు లేకుండా పేర్లు మాత్రమే ముద్రించారని, ఇంతకీ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇది ముమ్మాటికీ ప్రొటోకాల్ ఉల్లంఘనే అంటూ ఉభయదారులు, కాణిపాక వాసులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు విరుచుకుపడుతున్నారు. కాగా 2024లో వారి ఫొటోలతో సహా ముద్రించడం గమనార్హం.

గుడిని కూల్చి.. ఆక్రమణకు యత్నం

- నకిలీ పత్రాలతో కూటమి నేతల కుట్ర
- ఆలయ భూమి కాపాడాలని కమిటీ సభ్యుల డిమాండ్



మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మురంకబట్టులోని శ్రీసుందర వెంకటేశ్వరస్వామి గుడిని కూటమి నేతలు కూల్చేసి స్థలం ఆక్రమణకు యత్నిస్తున్నారని ఆలయ కమిటీసభ్యులు కార్తీకేయన్, సహదేవన్, ఎల్ఐసీ గోపి ఆరోపించారు. బుధవారం చిత్తూరు నగరంలోని మురకంబట్టులో ఈ మేరకు నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలయాన్ని ఆనుకుని 90 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఆన్‌లైన్‌లో డ్రై ల్యాండ్‌గా చూపుతున్న ఈ భూమి ఆక్రమణకు గురువుతోందని తెలిపారు. ప్రజాపరిష్కారవేదికలో ఫిర్యాదు చేస్తే డ్రై ల్యాండ్ చూపిస్తూ అధికారులు బోర్డు పెట్టారన్నారు. ఇటీవల కూటమికి చెందిన పుండరీకాక్షయ్య, ఆనందయ్య, చిన్ని, రాజు తదితరులు జేసీబీలతో ఆలయాన్ని కూల్చేశారని మండిపడ్డారు. నకిలీ పత్రాలు చూపిస్తూ ఈప్రభుత్వ భూమి తమదేనంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాదారుల నుంచి ఆలయ భూమిని విడిపించాలని కోరారు. కార్యక్రమంలో లోకేష్, గౌతమ్, శివ, విజయ్, ఇమాయరాజు, ప్రకాష్, హరి, అశోక్, కోటి, మురాజ్, శంకర్, కుప్పుస్వామి పాల్గొన్నారు.

జాతీయస్థాయి కథల పోటీల్లో చిత్తూరు విద్యార్థిని ప్రతిభ



సాయిరెడ్డి ఉదితి

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ స్థాయి కథల పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని సాయిరెడ్డి ఉదితి ప్రతిభ చూపి, బహుమతి సాధించినట్లు దేవీబాలామందిర్ పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్ వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పురిమళ్ల ఫౌండేషన్ (ఖమ్మం) ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కథలు, కవితల పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ఉదితి రాసిన మన భరత మాత (దేశభక్తి) కథ జాతీయ స్థాయిలో ఎంపికైందన్నారు. ఈ కథను సంకలనంగా ముద్రిస్తారని పురిమళ్ల ఫౌండేషన్ నిర్వాహకులు వెల్లడించారు. అనంతరం ఆ విద్యార్థినిని హెచ్‌ఎం సుజాత, టీచర్లు అభినందించారు.

చిత్తూరులో గీత సామాజిక వర్గానికి మద్యం బార్

చిత్తూరు అర్బన్: కార్పొరేషన్ పరిధిలో ఓ మద్యం బారును కల్లు గీత సామాజిక వర్గానికి కేటాయిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. రూ.5.10 లక్షల ఆన్ రీఫండబుల్ దరఖాస్తు రుసుము చెల్లించి మద్యం బారు కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీ ఈడిగ సామాజిక వర్గం కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలని.. లైసెన్స్ ఫీజును 50 శాతం రాయితీతో రూ.27.50 లక్షలుగా నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు చిత్తూరు కలెక్టరేట్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో దుకాణం కేటాయిస్తామని పేర్కొన్నారు.

పింఛన్ల తొలగింపు దుర్మార్గం



ఎంపీడీఓ ధనలక్ష్మితో మాట్లాడుతున్న దివ్యాంగులు

ఐరాల : దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దుర్మార్గమని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ రద్దు నోటీసు అందుకున్న 50 మంది బాధితులు బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఎంపీడీఓ ధనలక్ష్మికి నోటీసులు చూపించి తామ ఏం పాపం చేశామని వాపోయారు. అన్ని పరీక్షలు నిర్వహించిన తర్వాతే సదరం సర్టిఫికెట్ జారీ చేశారని వెల్లడించారు. దాదాపు 15 ఏళ్లుగా పింఛన్ పొందుతున్న తమకు ఇప్పుడు తొలగిస్తూ నోటీసు జారీ చేయడం దారుణమని మండిపడ్డారు. పింఛన్‌ల సంఖ్య తగ్గించేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎంపీడీఓ స్పందిస్తూ.. పింఛన్ గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హులందరికీ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

ఐటీఐ మూడో విడత అడ్మిషన్లకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మూడో విడత అడ్మిషన్లకు అవకాశం కల్పించారని జిల్లా కన్వీనర్ రవీంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లకు ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు చేసుకున్న అనంతరం ప్రభుత్వ ఐటీఐ అడ్మిషన్ విద్యార్థులకు ఈ నెల 29వ తేదీన, ప్రైవేట్ ఐటీఐ విద్యార్థులకు ఈ నెల 30వ తేదీన అడ్మిషన్ల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 7799679351, 9440738121, 9182590869 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

మామిడి చెట్లను ఆర్గానిక్ పద్ధతిలో పోషించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న రియల్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రామారావు

తవణంపల్లె: రైతులు మామిడి చెట్లను ఆర్గానిక్ పద్ధతిలో పోషించాలని రియల్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రామారావు, సంస్థ చైర్మన్ హనీషా తెలిపారు. తవణంపల్లెలో ఉపాధి హామీ కార్యాలయంలో రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రామారావు మాట్లాడుతూ మండలంలోని సరకల్లు, అరగొండ, తడకర, ఈచనేరి, వడ్డిపల్లె, ఉత్తర బ్రాహ్మణపల్లె, గల్లావాళ్లవూరు, దిగువ మత్యం గ్రామాల్లోని 20 మంది రైతులకు 35 ఎకరాల్లో 2,800 అన్ని రకాల మామిడి చెట్లు అందించినట్లు పేర్కొన్నారు. రైతులు చెట్లు పెంచి పర్యావరణాన్ని కాపాడాలనే లక్ష్యంతో రైతులకు ఉచితంగా మామిడి చెట్లు అందించినట్లు తెలిపారు. రైతులు ఆర్గానిక్ పద్ధతిలోనే మొక్కలు పెంచాలన్నారు. తవణంపల్లె క్లస్టర్ కోఆర్డినేటర్ శ్యామల, నవీన్ పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ సేవలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లాలో ఎంపిక చేసిన 10 మండలాల్లో గురువారం విధిగా ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ సేవలు నిర్వహించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకట ప్రసాద్ ఆదేశించారు. బుధవారం చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్టీ జనాభా అత్యధికంగా ఉన్న గ్రామాల్లో ఆరోగ్య సంరక్షణ సేవలు నిర్వహించాలన్నారు. సచివాలయం, విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల వద్ద శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటలకు శిబిరాల్లో వైద్యసేవలందించాలని స్పష్టం చేశారు. చిత్తూరు, విజయపురం, పెనుమూరు, నింద్ర, కార్వేటినగరం, యాదమరి, గంగవరం, రాయల్‌పేట, పెద్ద ఉప్పరపల్లె, శాంతిపురం మండలాలను ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ సేవలకు ఎంపిక చేసినట్లు వివరించారు.

కుమరేషన్‌కు తెలుగుతేజం అవార్డు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరుకు చెందిన అధ్యాపకులు కుమరేషన్ శ్రీశ్రీకళా వేదిక తెలుగు తేజం అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 31వ తేదీన పల్నాడు జిల్లాలోని నరసరావుపేటలో జరిగే వేదికలో ఈ అవార్డును అందుకోనున్నారు. ఈయనతో పాటు జిల్లాలో మరో 6 మంది కవులు ఎంపికయ్యారు.

దోమల నియంత్రణతో వ్యాధుల కట్టడి



వెంగళరావు కాలనీ కాలువలో ఆయిల్‌బాల్స్ వేస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: దోమలను నియంత్రణతోపాటు అవి కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో వ్యాధులను కట్టడి చేయవచ్చని జిల్లా ఇన్‌చార్జ్ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ అన్నారు. ఇందుకోసం ప్రతీ ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం చిత్తూరు నగరంలోని వెంగళరావు కాలనీలో కార్పొరేషన్ అధికారులతో కలిసి అవగాహన ర్యాలీ, దోమల నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకర విష జ్వరాలు చాలా వరకు దోమ కాటుతోనే వస్తాయన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, నిల్వ నీరు లేకుండా చూడడంతో దోమలను నియంత్రించవచ్చన్నారు. దోమల నియంత్రణకు నగరపాలక సంస్థ పరిధిలో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్ వెంకటరామిరెడ్డి చెప్పారు. ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ నగరపాలక పరిధిలో దోమల నియంత్రణకు ఫాగింగ్, మెలాథియన్ పిచికారీ, నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం తదితర చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం మేజర్ కాలువలో ఆయిల్ బాల్స్ వేసి, మందు పిచికారీ చేయించారు. దోమల నియంత్రణపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



బంగారుపాళెంలో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న పద్మమ్మ

బంగారుపాళెం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని పట్టు పరిశ్రమ శాఖ సంయుక్త సంచాలకురాలు, మండల ప్రత్యేక అధికారి పద్మమ్మ అన్నారు. బుధవారం బంగారుపాళెం, పాలేరు, తుంబకుప్పం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా? లేదా అని ఆరా తీశారు. అంగన్‌వాడీ పిల్లల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీకి రోజూ ఎంత మంది రోగులు వస్తున్నారు.. వైద్య సేవలు ఎలా అందిస్తున్నారని రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లోకేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు షామీదాబేగం, కవిత తదితరులు పాల్గొన్నారు.

సంవత్సరమంతా భూమిని కప్పి ఉంచండి



అంతరపంటలను పరిశీలిస్తున్న ఆర్‌వైఎస్‌ఎస్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు

పెనుమూరు(కార్వేటినగరం): ప్రకృతి వ్యవసాయం విధానంలో భాగంగా సంవత్సరమంతా భూమిని కప్పి ఉంచాలని ఆర్ వైఎస్ఎస్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ వాసు సూచించారు. బుధవారం కేసీ పల్లి, తిరివిరెడ్డిపల్లి, చార్వాకానిపల్లి పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిని కప్పి ఉంచడంతో భూసారం పెరగడమే కాకుండా భవిష్యత్తులో మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. బహుళ పంటలు సాగు చేయడంతో ఒక పంట పోయినా మరో పంట ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. వర్షాలు బాగా కురవడంతో వేరుశనగలో అంతర పంటలు సాగు చేయాలని సూచించారు. అలాగే సెప్టెంబర్‌లో రాష్ట్రస్థాయి అధికారులు క్షేత్ర పరిశీలన చేయనున్నారని, ఈ లోపు సిబ్బంది రైతులు ఏ గ్రేడ్, ఏటీఎం, పీఎండీఎస్, బహుళ పంటలు, ఆర్డీస్ పంటలు సాగు చేయాలని పేర్కొన్నారు. అనంతరం వరిలో అంతర పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హనుమంతు, నవీన్, హరికృష్ణారెడ్డి, వెంకటేష్, అనిల్‌కుమారి, గౌతమి, మణెమ్మ, హేమలత, భాస్కర్, రామానాయుడు పాల్గొన్నారు.

వి.కోటలో చైన్ స్నాచింగ్



సీసీ ఫుటేజ్‌లో రికార్డు అయిన దుండగుల ఫొటో

వి.కోట: మహిళ మెడలోని బంగారుచైన్‌ను గుర్తుతెలియని దుండగులు బైక్‌పై వచ్చి లాక్కెళ్లిన సంఘటన పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన అమరావతి అనే మహిళ స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం స్థానిక వేణుగోపాలస్వామి వీధిలోని ప్రాథమిక పాఠశాల వద్దకు నడుచుకుని వెళుతుండగా ఆమెను బైక్‌పై వెంబండించిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలోని బంగారు చైన్‌ను లాక్కెళ్లారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులలో డ్రైవింగ్ సీట్‌లో ఉన్న వ్యక్తి హెల్మెట్ ధరించి,వెనక కూర్చున్న వ్యక్తి తలకు టోపీ, కళ్లద్దాలు ధరించి ఉన్నారని బాధితురాలు తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు.

కలెక్టర్ సారూ.. కరుణచూపరా..!

- కాళ్లు, చేతులు పడిపోయి.. బక్కచిక్కిపోయిన హర్షద్
- రీ వెరిఫికేషన్‌లో 40 శాతం తక్కువగా ఉందని పింఛన్ కట్
- కలెక్టర్ వద్ద గోడు వెళ్లబోసుకున్న జరగని న్యాయం
- మళ్లీ జీరో శాతమంటూ ఆస్పత్రి రిపోర్ట్



హర్షద్

బంగారుపాళ్యం/కాణిపాకం: పక్షవాతంతో ఓ దివ్యాంగుడికి కాళ్లు, చేతులు పూర్తిగా పడిపోయాయి. బక్కచిక్కిపోయిన శరీరంతో ప్రాణం నిలబెట్టుకుంటున్నారు. ఇన్నాళ్లు పింఛన్ సొమ్ముతో కాస్త ఆయుషు పోసుకుంటున్నాడు. అయితే రీ వెరిఫికేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం ఆ దివ్యాంగుడి పింఛన్‌కు ఎసురు పెట్టింది. తొలుత 40 శాతం కంటే తక్కువగా వైకల్యం ఉందని, కలెక్టర్ ఫిర్యాదుతో జీరో శాతం ఉందని మళ్లీ నోటీసులు ఇవ్వడంతో కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. బంగారుపాళెం మండల కేంద్రానికి చెందిన సమ్మద్, సాహిన్ దంపతుల పెద్ద కుమారుడు హర్షద్. ఇతడు 8 నెలలకే జన్మించాడు. పుట్టుకతోనే పక్షవాతం బారిన పడ్డాడు. దీనికితోడు మెదడు సమస్య వచ్చింది. అప్పటి నుంచి హర్షద్‌ను తల్లిదండ్రులు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారు. నెలవారీ పింఛన్‌తో హర్షద్ ఆస్పత్రి ఖర్చులు చూసుకుంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం చేపట్టిన రీ వెరిఫికేషన్‌లో హర్షద్‌ను అనర్హుడిగా తేల్చారు. 40 శాతం కంటే తక్కువగా ఉందని సచివాలయ సిబ్బంది నోటీసులు ఇచ్చారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు రోడెక్కారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ మళ్లీ వెరిఫికేషన్‌కు ఆదేశించారు. అయితే ఆ రిపోర్ట్‌ను జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని పరిశీలన విభాగం కొట్టిపడేసింది. మళ్లీ జీరో శాతమని, హర్షద్ బాగుండాడని, ఎలాంటి సమస్యలు లేవని నివేదిక ఇచ్చింది. ఈ రిపోర్ట్‌ను బుధవారం సచివాలయ సిబ్బంది బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ నోటీసును చూసి వారు కంటతడిపెడుతున్నారు. కలెక్టర్‌కు విన్నవించుకున్న ఏమిటీ విచిత్రమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుమారుడి చూసి...ఎలాంటి సమస్యలు లేనట్లు ఇవ్వడం విడ్డూరంగా ఉందని ఆగ్రహానికి గురవుతున్నారు. నిజంగానే అధికారులకు కళ్లుండి ఇలా చేస్తున్నారా.. లేక కక్షపూరితంగా చేస్తున్నారనే అనుమానాలు వారిలో వ్యక్తమవుతున్నాయి. కనికరం లేకుండా ఇలా చేయడం దారుణమని కన్నీరు మున్నీరవుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ కల్పించుకుని న్యాయం చేస్తారా, లేదా చూడాలి మరీ.

వేతన సవరణ సంఘం ఏర్పాటు చేయాలి



జిల్లా తపాలా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్ : తపాలా ఉద్యోగుల వేతన సవరణకు ఎనిమిదో వేతన సంఘాన్ని కేంద్రం వెంటనే ఏర్పాటు చేయాలని తపాలా శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా శాఖ కార్యాలయం ఎదుట బుధవారం ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ ధర్నాలో నాయకులు భాస్కర్ మాట్లాడుతూ గ్రామీణ డాక్ సేవక్‌లు, పెన్షనర్‌లందరికీ వేతన సవరణతో సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎనిమిదో వేతన సవరణలో పెన్షనర్లకు సవరణ చేయబోమని ప్రకటించడం దారుణమన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. ఈ ధర్నాలో నాయకులు రామమూర్తి, అరుణ, మహదేవన్, దామోదర, హరిప్రసాద్, సురేంద్ర, చిన్నబ్బ తదితరులు పాల్గొన్నారు.